ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు చకచకా

- డోన్, ఆలంకొండ వద్ద ముమ్మరంగా పనులు
- పర్యవేక్షిస్తున్న ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు



డోన్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి తదితరులు



బహిరంగసభ స్థలిలో విశాలమైన షెడ్

డోన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. పర్యటనకు గడువు రెండు రోజులే ఉండటంతో పనులు శరవేగంగా చేస్తున్నారు. హంద్రీనీవా నీటిని ఉమ్మడి జిల్లాలో 77 చెరువులకు మళ్లించేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం జగన్ వస్తున్నారు. కృష్ణగిరి మండలం ఆలంకొండ వద్ద ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన అనంతరం, డోన్ పట్టణంలో భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ మేరకు కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సృజన, డాక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీలు శ్రీకాంత్, రఘువీర్‌రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సభాస్థలిని పరిశీలించిన మంత్రి బుగ్గన..

డోన్ పట్టణ శివారులోని వెంకటనాయినిపల్లె సమీపంలో నిర్వహిస్తున్న బహిరంగ సభా స్థలాన్ని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. మంత్రి వెంట నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీశామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటరెడ్డితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఉన్నారు. సభా వేదిక, ప్రేక్షకుల గ్యాలరీ, వీఐపీల గ్యాలరీల ఏర్పాట్ల పనులతో పాటు హెలిపాడ్ పనులు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మంత్రి వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, డీఆర్‌ఓ పుల్లయ్య, సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు జానకిరాముడు తదితరులు ఉన్నారు.

పకడ్బందీ బందోబస్తు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పకడ్బందీ బందోబస్తు చేపడుతున్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన ఏర్పాట్లపై డోన్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలంకొండ వద్ద హంద్రీనీవా కాల్వపై ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన అనంతరం డోన్‌లో జరిగే బహిరంగ సభలో సీఎం పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కొక్క విభాగానికి ఒక్కో ఉన్నతాధికారికి బాధ్యతలు అప్పగించామన్నారు. సీఎం పర్యటనలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కూడా హెలిపాడ్, సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ రెగ్యులేషన్, రూట్ బందోబస్తు, కాన్వాయ్ భద్రత లాంటి వాటిపై స్వయంగా అధికారులతో చర్చించి బాధ్యతలు అప్పగించినట్లు వారు వివరించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన బావిపల్లె టీడీపీ నాయకులు



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బావిపల్లె గ్రామస్తులు

డోన్ : ప్యాపిలి మండలంలో టీడీపీ కంచుకోటగా భావించే బావిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సర్పంచ్ తలారి లింగన్న కుమారుడు తలారి రామాంజనేయులుతోపాటు నాయకులు, పది కుటుంబాల సభ్యులు ఆదివారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బావిపల్లెకు చెందిన టీడీపీ నాయకులు కొండయ్య, బాలు, రాముడు, అంజి, బాల లింగన్న, పుల్లయ్య తదితర పది కుటుంబాల సభ్యులు టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి బుగ్గన వారికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న తీరుకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామని ఈ సందర్భంగా రామాంజనేయులు తెలిపారు. త్వరలోనే తమ గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతారని ఆయన చెప్పారు. డోన్ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బోరెడ్డి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టిరెడ్డి, రామాంజనేయులు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టుపల్లె వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విరాట్ విశ్వకర్మ యజ్ఞం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: పట్టణంలోని బనగానపల్లె చౌరస్తాలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ం నాయకులు కుమార్ ఆచారి, మునిస్వామి, హరికృష్ణమాచారి, రాజేశ్వరాచారి, దామోదర్‌ఆచారి, శ్రీనువాసుల ఆచారి పాల్గొన్నారు.

బనగానపల్లె : మండలంలోని పలుకూరు గ్రామంలోని శ్రీరామాలయంలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానందఆచారి ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి పూజలు చేశారు. కార్యక్రమంలో బాలసరస్వతి భజన మండలి అధ్యక్షులు బాలహనుమంతు పాల్గొన్నారు.

ప్యాపిలి/డోన్ టౌన్ : సకల వేదముల ప్రకారం విశ్వకర్మయే సృష్టికర్తని, తన కళా నైపుణ్యం ద్వారా ప్రపంచానికే భారతదేశ విశిష్టతను తెలియజేసిన తొప్ప రూపకర్త అని విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వీరనారాయణ ఆచారి అన్నారు. విశ్వకర్మ జయంతి పురస్కరించుకొని ఆదివారం ప్యాపిలి మండలం మునిమడుగు గ్రామంలోని పూరాతన భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డే మహారాజ్, విశ్వకర్మ సంఘీయులు బ్రహ్మయ్య ఆచారి, రాఘవేంద్ర ఆచారి, శివ ఆచారి,విశ్వం ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండల కేంద్రమైన బేతంచెర్లతో పాటు గ్రామాల్లో విశ్వబ్రాహ్మణ సోదరులు విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నంద్యాల రహదారిలోని జీఎస్ఆర్ ఫంక్షన్ హాలులలో విశ్వకర్మ యజ్ఞమహోత్సవ జయంతిని పురస్కరించుకొని విశ్వ బ్రాహ్మణ సోదరులు శ్రీనివాసులు ఆచారి, వెంకటేశ్వర్లు, సుదర్శన్, లింగమూర్తి, రాజశేఖర్, గోపాలు, విజయ గోపాల్ ఆచారి ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వీరభద్రస్వామి వేశాధారణలో నంది కోల సేవతో గ్రామోత్సవం నిర్వహించారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభించిన ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ : స్థానిక కేవీఎస్ హాస్పిటల్ వద్ద ఫ్లైఓవర్ కింద రోటరీక్లబ్ ఏర్పాటు చేసిన హెల్పింగ్ హ్యాండ్స్ సెంటర్‌ను ఆదివారం ఆర్డీఓ వెంకటరెడ్డి ప్రారంభించారు. 'మీకు అవసరమైనవి ఇక్కడ ఉంటే తీసుకు వెళ్లండి... మీకు ఉపయోగం లేనివి మీ ఇంటిలో ఉంటే ఇక్కడ వదిలేయండి' అనే నినాదంతో సెంటర్ ఏర్పాటు అభినందనీయమని ఈ సందర్భంగా ఆర్డీఓ పేర్కొన్నారు. నిరుపేదలు, అభాగ్యులు, అనాథలకు ఉపయోగపడే కార్యక్రమం ఏర్పాటు సంతోషకరమని క్లబ్ సభ్యులను అభినందించారు. సెంటర్ ఏర్పాటుకు సహకరించిన దాతలకు ప్రాజెక్టు చైర్మన్ జింకల క్రిష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రాజా విజయ్‌కుమార్, జగన్‌మోహన్, నాగరాజు, డిష్ రఫీ, దశరథ రామిరెడ్డి, శేఖర్ యాదవ్, రాజయ్యగౌడ్, క్రిష్ణకిశోర్, గంగిరెడ్డి, మల్లారెడ్డి, ఎస్ఎల్ మధు, బలరాముడు, జాకీర్‌హుసేన్, ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యురాలు రాజాసుజాత, మలిశెట్ల శారద, అనంతలక్ష్మి, భాగ్యలక్ష్మి, అనురాధ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

సంజామల: మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి... కూతరు, అల్లుడు తొమ్మిదేళ్ల క్రితమే మృతి చెందారు. దీంతో మనవడు మాయలూరి నరసింహ, మనవరాలు మాయలూరి సుజాత అవ్వ దగ్గరే ఉంటున్నారు. మనవడు, మనువరాలితో కలిసి అవ్వ లక్ష్మీదేవి రాత్రి భోజనం చేసి పడుకున్నారు. అయితే ఆదివారం ఉదయం లేచి చూసే సరికి మనవరాలు సుజాత కనపడలేదు. బంధువులు, స్నేహితులను విచారించారు. అయినా ఆచూకి తెలియలేదు. దీంతో సాయంత్రం లక్ష్మీదేవి తన మనువరాలు కనిపించడం లేదని పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి పిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలు గొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, ఆల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

మంత్రి బుగ్గనకు వినతి

డోన్ : కేశవరెడ్డి విద్యాసంస్థ నమ్మి పదేళ్ల క్రితం నష్టపోయిన బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తమ పిల్లల చదువు కోసం విద్యా సంస్థలో చెల్లించిన డబ్బును నేటికీ తిరిగి ఇవ్వలేదని, న్యాయం చేయాలని వారు మంత్రికి విన్నవించారు.

సన్మానం

బనగానపల్లెరూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఇటీవల జిల్లా ఉత్తమ అవార్డు పొందిన పట్టణానికి చెందిన ఏపీటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు మధుసూదన్‌రావు దంపతులను సన్మానించారు. ఏపీటీఎస్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి, జూనియర్ కళాశాల అధ్యాపకులు రామాంజనేయులు, ఎస్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఓబులరెడ్డి, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు సత్యప్రకాష్, జిల్లా కార్యదర్శి హరినాథ్‌గౌడ్ తదితరులు మధుసూదన్‌రావు దంపతులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

ఐటీ ఉద్యోగ మహిళ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- చంద్రబాబు అరెస్ట్‌కు రజకులకు ఏంటి సంబంధం
- రజక సంఘ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి

కోవెలకుంట్ల: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును స్కిల్ స్కాంలో సీఐడీ అధికారులు అరెస్ట్ చేస్తే బెంగుళూరులో ఐటీ ఉద్యోగం చేస్తున్న ఓ తెలుగు మహిళ రజకులను కులం పేరుతో దూషించి మాట్లాడిందని రజక సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి ఆరోపించారు. ఆదివారం ఆయన కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ చాకలి... చాకలి వెదవలంటూ రజకుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం హేయమైన చర్యగా ఖండించారు. రామాయణంలో సీత అడవికి వెళ్లటానికి చాకలి కారణమని, వనవాసం నుంచి అగ్ని పరీక్ష చేసి సీత తిరిగి వచ్చిందంటూ రజకులను చాకలి, చాకలి వెదవలంటూ మాట్లాడటం సమంజసం కాదన్నారు. చంద్రబాబు అరెస్టుకు రజక కులానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. రజకుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన ఆమె బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రజక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాలతిమ్మయ్య, చిన్న భూషణం, బాలరాజు, పక్కీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కాటసాని రాక

అవుకు: వినాయక చవిత సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అవుకు పట్టణానికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ముస్లిం వీధిలోని చిన్నబడి వద్ద ఏర్పాటు చేసిన గణనాథునికి ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, అవుకు పీఏసీఎస్ చైర్మన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, చల్లా రఘునాథ్ రెడ్డి, కాటసాని తిరుపాల రెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పూజలు చేస్తారన్నారు.

భార్యపై రోకలిబండతో దాడి

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరులో మద్యానికి బానిసై కట్టుకున్న భార్యను భర్త రోకలి బండతో దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కల్పన అందించిన సమాచారం మేరకు...రేవనూరుకు చెందిన సరస్వతికి బండిఆత్మకూరు మండలం చిన్న కోడూరుకు చెందిన నాగేష్‌తో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మద్యం తాగుతూ కుటుంబ పోషణను పట్టించుకోకపోవడంతో మూడు సంవత్సరాల క్రితం భర్త, కుమారుడు, కుమార్తెతో పుట్టింటికి వచ్చి ఇక్కడే జీవనం సాగిస్తోంది. అయినప్పటికీ భర్తలో మార్పు రాలేదు. ఆదివారం ఉదయం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో రోకలి బండతో తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఆమెను ఆసుపత్రికి తరలించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వర్షం కోసం గంగమ్మకు పూజలు



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ నాయినపల్లెలో ఆదివారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గంగమ్మకు పూజలు నిర్వహించారు. గ్రామపెద్దలు,రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రదాయ బద్ధంగా బానం కుండను ఎత్తారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలను తీసుకొచ్చారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సరస్వతి దంపతులు బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరి వెలుపుల ఉన్న గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు.

అవధాన పురస్కార గ్రహీతకు సత్కారం



దత్తాత్రేయ శర్మను సత్కరిస్తున్న ఆవోపా సభ్యులు

డోన్ టౌన్ : అత్యంత ప్రతిష్టాత్మకమైన అవధాన పురస్కారాన్ని అందుకున్న శతవధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మను ఆదివారం సాయిత్రం స్థానిక గాయిత్రీ పీఠంలో ఆవోపా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆవోపా అధ్యక్ష, కార్యదర్శులు మాకం కృష్ణకిషోర్,జోన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి తదితరులు గండ్లూరి దత్తాత్రేయ శర్మకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.